
బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కును అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ప్రజల తరఫున నిలబడి పోరాడుతాం

- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

చందంపేట(నేరేడుగొమ్ము), జనవరి 11 : ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, బీఆర్ఎస్ పార్టీ వారి తరఫున నిలబడి పోరాడుతుందని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం నేరేడుగొమ్ము మండలంలోని పేర్వాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గాదం నారయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ అందించిన ప్రమాద బీమా కింద అతడి కుటుంబానికి మంజూరైన రూ.2లక్షల చెక్కును శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్ముకొని పని చేసే కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుందని, తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ముక్కమల బాలయ్య, నాయకులు ఆరెకంటి రాములు, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌కే.బషీర్, వడ్త్య బాలు, తులసీరాం, వెంకటయ్య, హరిదాసు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి


బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ప్రమాదబీమా చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ, జనవరి 11 : బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడేనికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వల్లపు కొండల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ సభ్యత్వం ద్వారా కొండల్‌కు మంజూరైన రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కును మృతుడి కుటుంబానికి శనివారం హైదరాబాద్‌లోని తన ఇంట్లో మాజీ ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రైతుబంధు సమితి మాజీ మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ, జిల్లా నాయకులు రామిడి వెంకటరమణారెడ్డి, చెర్కు లింగంగౌడ్, ఊరిపక్క నగేశ్, అయిలీ లక్ష్మీనర్సింహ, కుంభం మాధవరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు వల్లపు సైదులుయాదవ్, నాయకులు వల్లపు పర్వతాలు, రామిడి మహిపాల్ రెడ్డి, మట్టిపల్లి నర్సింహ, జంగయ్య పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ ఎస్పీ కవితపై బదిలీ వేటు

- డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు
- ఆమె స్థానంలో శ్రీనివాస్‌రావుకు పోస్టింగ్
- సమగ్ర విచారణకు ప్రత్యేక బృందం ఏర్పాటు

నీలగిరి, జనవరి11 : నల్లగొండ-సూర్యాపేట జిల్లాల ఇంటెలిజెన్స్ ఎస్పీ గంజి కవితపై రాష్ట్ర పోలీస్ యంత్రాంగం బదిలీ వేటు వేసింది. రేషన్, గుట్కా మాఫియా నుంచి అక్రమ వసూళ్లు, సిబ్బంది వద్ద చేతివాటం, వేధింపులు, రియల్ ఎస్టేట్ పేరుతో చేస్తున్న అక్రమాలకు పాల్పడుతున్నారని ఇంటెలిజెన్స్ ఎస్పీపై ఆరోపణలు చేస్తూ ఓ అజ్ఞాత వ్యక్తి రాసిన 9 పేజీల లేఖ రెండ్రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. దీనిపై దృష్టి సారించిన రాష్ట్ర నిఘా విభాగం విచారణ చేపట్టింది. అందులో భాగంగా శనివారం ఆమెను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో శ్రీనివాస్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ఆయన శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కవితపై వచ్చిన ఆరోపణలపై విచారణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వేముల వీరేశం

మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల

చిట్యాల, జనవరి 11 : మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, తాసీల్దార్ కృష్ణ, కౌన్సిలర్లు జమాండ్ల జయమ్మాశ్రీనివాస్‌రెడ్డి, బెల్లి సత్తయ్య, కోఆప్షన్ సభ్యుడు పాటి మాధవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నకిరేకల్ : ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ డైరీ, క్యాలెండర్‌ను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం పట్టణంలోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ అదనపు కార్యదర్శి ఎమ్‌డీ అబ్బాస్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేశ్, డివిజన్ అధ్యక్షుడు సమ్మిరెడ్డి, సబ్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, వెంకన్న, సెక్షన్ లీడర్లు రాములు, సంజీవ, రవికుమార్, సైదులు పాల్గొన్నారు.

ఏఎస్పీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

ఏఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

చందంపేట(దేవరకొండ), జనవరి 11 : దేవరకొండ ఏఎస్పీ పి.మౌనికను శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు రమావత్ రమేశ్‌నాయక్ ఆమెకు పూల మొక్క అందించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీని కలిసిన వారిలో నాయకులు సత్యం, బోడ యాదయ్య, తరి గోవర్ధన్, ముడావత్ జగ్రూనాయక్, ఆంజనేయులు, దయాకర్, రవినాయక్, లక్ష్మణ్, శ్రీను ఉన్నారు.

రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసరాలు అందించాలి

- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి

సంతకాల సేకరణ చేపడుతున్న ఐద్వా సభ్యులు

కొండమల్లేపల్లి, జనవరి 11: ప్రస్తుతం నిత్యావసరాల ధరలు పెరిగి పేదలు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసరాలను అందించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. నిత్యావసరాల ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు పద్మ, మనీషా, మంజుల, ఏకలవ్య, ఉషారాణి పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా ముందస్తు సంక్రాంతి

- వాడవాడలా ముగ్గుల పోటీలు
- ప్రైవేటు పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

నల్లగొండలోని కాకతీయ కళాశాలలో ...

నల్లగొండలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

రామగిరి, జనవరి 11: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ముందస్తు సంబురాలు కొనసాగుతున్నాయి. పలు ప్రైవేటు విద్యా సంస్థల్లో శనివారం విద్యార్థులు సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు పల్లె ప్రజల, రైతు, హరిదాసు వేషధారణల్లో అలరించారు. భోగి మంటలు, ముగ్గులు వేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు వాడవాడలా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాయి. జిల్లా కేంద్రంలోని డీవీకే రోడ్డులో ఉన్న మాస్టర్ మైండ్ హైస్కూల్లో, కాకతీయ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు.

నల్లగొండలోని శివాజీనగర్‌లో ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

నల్లగొండలోని ప్రైవేటు పాఠశాలలో సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొని సంప్రదాయ దుస్తులతో అలరిస్తున్న చిన్నారులు

భిక్షానాయక్ మృతికి భాస్కర్‌రావు సంతాపం

దామరచర్ల, జనవరి11: మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన భూక్య భిక్షానాయక్ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు గ్రామానికి వెళ్లి భిక్షానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆంగోతు లలితాహతీరాం నాయక్, మాజీ వైస్ ఎంపీపీ కటికం సైదులురెడ్డి, పున్నా నాయక్, సేవానాయక్, కుందూరు శ్యామ్‌సుందర్‌రెడ్డి, హనిమీరెడ్డి ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

చందంపేట(నేరేడుగొమ్ము), జనవరి 11 : నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో 6,7,8,9,10 తరగతులతో పాటు ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నేనావత్ లాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొనారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేవీకేలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు దరఖాస్తులు

త్రిపురారం, జనవరి 11: యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవీకేలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టు కోసం వ్యవసాయ డిప్లొమా లేదా వ్యవసాయ డిగ్రీ పట్టా కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 15న ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూకు రెజ్యూమ్‌తో హాజరు కావాలని సూచించారు.

మాజీ ఎంపీటీసీకి పలువురి పరామర్శ

త్రిపురారం, జనవరి 11: మాజీ ఎంపీటీసీ కూతాట సాంబయ్య భార్య లక్ష్మమ్మ శనివారం మృతి చెందారు. పలువురు నాయకులు వారి ఇంటికి వెళ్లి లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు నాయకులు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, ముడిమల్ల బుచ్చిరెడ్డి, చిలుముల శ్రీను, పీబీ.రవి, నగిరి శ్రీను, సలికంటి బాలకృష్ణ, శంకర్, సైదిరెడ్డి ఉన్నారు.

సమాచార హక్కు చట్టం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకన్న

రామగిరి, జనవరి 11: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సిద్ధం వెంకన్నను నియమిస్తూ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకన్నను కమిటీ కార్యవర్గం అభినందించింది.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడలు దోహదం

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), జనవరి 11: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం క్రీడా మైదానం నుంచే మొదలవుతుందని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి అన్నారు. మండలంలోని బట్టువెంకన్నబావితండా, సపావత్‌తండాల్లో గణేశ్ యువజన సంఘం ఆధ్వర్యంలో మెరావత్ మునినాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెటీ పోటీలను శనివారం ఎమ్మెల్సీ కోటిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా యువత మధ్య స్నేహసంబంధాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజుయాదవ్, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు బీవీ.రమణరాజు, నాయకులు తేరా రాఘవరెడ్డి, జటావత్ శ్రవణ్‌కుమార్, ప్రకాశ్‌నాయక్, కిశోర్, చల్లా కోటేశ్, గడ్డమీది నాగార్జున, వెంకట్రావు, మేఘా, లాల్‌సింగ్, రవి, రంగా, సంతోశ్, లచ్చిరాం, చందునాయక్, పోటీల నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

'పరీక్షా పే చర్చ' కార్యక్రమానికి మోడల్ స్కూల్ విద్యార్థిని

అంజలి

గుర్రంపోడ్, జనవరి 11: ప్రధానమంత్రితో ముఖాముఖిగా జరిగే పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల ఎంపిక పోటీకి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థిని పి.అంజలి ఎంపికైంది. ఇందుకోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎంట్రీ పోటీల్లో రాష్ట్రం నుంచి వేలాది మంది విద్యార్థులు పోటీ పడగా కేవలం ఇద్దరిని మాత్రమే ఎంపిక చేశారు. అందులో అంజలి ఒకరు. ఈ నెల 15న ఢిల్లీలో జరిగే 'పరీక్షా పే చర్చ డిస్కషన్ పోటీలో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి విద్యార్థులు పోటీ పడనున్నారు. అందులో ఎంపికైన వారు ప్రధాన మంత్రితో ముఖాముఖిలో పాల్గొంటారు. మన రాష్ట్రం నుంచి ఈ పోటీకి అంజలితో పాటు గైడ్ టీచర్ శీతల్‌ను ఢిల్లీకి పంపించడానికి ఎస్ఈఆర్టీ ఏర్పాట్లు చేసింది. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అంజలిని స్కూల్ ప్రిన్సిపాల్ జి.రాగిణి, గైడ్ టీచర్ శీతల్, అధ్యాపక బృందం అభినందించారు.

గూండాయిజమే కాంగ్రెస్ పార్టీ నైజం

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

నార్కట్‌పల్లి, జనవరి 11: గూండాయిజమే కాంగ్రెస్ పార్టీ నైజమని, యాదాద్రి భువనగిరి జిల్లాలో బీఆర్ఎస్ కార్యాలయంపై దాడితో వారి నైజం మరోసారి రుజువైందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే బీఆర్ఎస్ వారికి అండగా ఉంటూ పోరాటాలు చేస్తున్నదని, దానిని ఓర్వలేకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి దాడులు చేయిస్తున్నదని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి పాలన ప్రారంభమై సంవత్సరమైనా పథకాల అమలులో జాప్యం చేస్తున్నదని, ఈ విషయమై ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడడం సిగ్గుచేటని పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన కాంగ్రెస్ గుండాలను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతమైతే బీఆర్ఎస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

చిత్రియాలలో క్రికెట్ పోటీలు

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జాల నర్సింహారెడ్డి

చందంపేట, జనవరి 11 : మండలంలోని చిత్రియాల గ్రామంలో జాల అండాలమ్మ-వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, జేపీఆర్ ఇన్‌ఫ్రా ఎండీ జాల తిలక్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోర్నమెంట్‌లో సుమారు 20 జట్లు పాల్గొంటున్నాయని, విన్నర్‌కు రూ.27 వేలు, రన్నరప్‌కు రూ.18 వేలు, మూడో బహుమతిగా రూ.9వేలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ రాము చౌహాన్, మార్కెట్ డైరెక్టర్ రాజు, సీపీఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

నకిలీ జమానత్ పెట్టి కోర్టును మోసం చేసిన ముగ్గురి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, జనవరి 11: నిందితుడిని విడిపించేందుకు నకిలీ జమానత్ సమర్పించి కోర్టును మోసం చేసిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణంలో 2018లో జరిగిన ప్రణయ్ హత్య కేసులో ప్రధాన నిందితుడైన బీహార్ రాష్ట్రానికి చెందిన సుభాశ్‌శర్మను అప్పట్లోనే పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. 8 ఏండ్లుగా జైలులో ఉన్న సుభాశ్‌శర్మ 2024 నవంబర్‌లో హైకోర్టులో బెయిల్ పిటిషన్ వేయగా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. హత్య కేసు విచారణ జరుగుతున్న కోర్టులో జమానత్ అందించి బెయిల్ పొందాలని ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో నిందితుడి తరపు వారు మధ్యవర్తుల ద్వారా కేతేపల్లి మండలం కొత్త పేట గ్రామానికి చెందిన వంగాల సైదులు, మాడ్గులపల్లి మండలం పాములపాడు గ్రామానికి చెందిన చింతచర్ల దేవయ్య, ముక్కాముల మల్లేశ్‌ను సంప్రదించారు. వారు సూర్యాపేటలో నకిలీ జమానత్ ఫారాలు, స్టాంపులు, పాములపాడు గ్రామ పంచాయతీ ఆఫీసు ముద్రలను తయారు చేయించి సంతకాలు ఫోర్జరీ చేసి కోర్టులో జమానత్ పత్రాలు అందించారు. జిల్లా కోర్టు సదరు జమానత్ కాగితాలను వెరిఫికేషన్ కోసం వేములపల్లి, మాడ్గులపల్లి పోలీసులను ఆదేశించింది. పోలీసులు గ్రామపంచాయతీ సెక్రటరీ సైదులును విచారించగా అవి నకిలీ పత్రాలని, తాను జారీ చేయలేదని పోలీసులకు తెలిపాడు. దాంతో ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో మొదటి నిందితుడు వంగాల సైదులుపై నల్లగొండ జిల్లాలో 21 దొంగతనం కేసులు నమోదై ఉన్నాయని, జైలుకు సైతం వెళ్లివచ్చాడన్నారు. 2022లో నారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఒక హత్య కేసు విషయంలో కూడా జమానత్ పెట్టగా చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, ఆ కేసు కూడా కోర్టు విచారణలో ఉందన్నారు. ఈ విషయపై వీరికి సహకరించిన వారు ఎవరనేది విషయమై వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులను కోర్టుకు రిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో రూరల్ సీఐ వీరబాబు, వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వారికే ఖర్చుచేస్తాం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వేదికపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

నందికొండ, జనవరి 11 : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను వారి కోసమే ఖర్చు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీ ప్రాజెక్ట్‌హౌస్‌లో నిర్వహిస్తున్న గిరిజన ఆదివాసి సాధికారిత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షమ పథకాలను అమలు చేస్తున్నదని, భూమిలేని రైతులకు రూ.12 వేల రైతు భరోసను ఇవ్వనున్నట్లు చెప్పారు. రూ.20,500 కోట్ల వ్యయంతో ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఆదివాసీల అభున్నతికి అనేక చట్టాలు చేసిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి బడ్జెట్‌లో 10 శాతం కంటే ఎక్కువ నిధులు కేటాయిస్తామన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అంతకు ముందు హెలీపాడ్ వద్ద డిప్యూటీ సీఎం, మంత్రులకు జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు జయవీర్ రెడ్డి, రాంచందర్‌నాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, బాలూనాయక్, రాందాస్‌నాయక్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ డిపార్ట్‌మెంట్ జాతీయ కోర్డినేటర్ రాజు, ట్రైకార్ చైర్మన్ బెల్లంనాయక్, డీసీసీ చైర్మన్ శంకర్‌నాయక్, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ

దుస్తులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నీలగిరి, జనవరి11 : నల్లగొండ మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు శనివారం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల కోసం పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూమి లేని నిరుపేదలకు రూ.12 వేలు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

చండూరు, జనవరి 11: రాష్ట్రంలో భూమిలేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగురు నరసింహ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం భూతరాజు సైదులు అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కొత్త రేషన్ కార్డులు, వింతతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ పెంచాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి సతీశ్, సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేశ్, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ జానిమియా, చెడుబుద్ధి ఉషయ్య, కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇరిగి సంజీవ పాల్గొన్నారు.


నల్లగొండ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

నల్లగొండ సిటీ, జనవరి 11 : సంక్రాతి పండుగ నేపథ్యంలో పాఠశాలలు, కళాశాలలకు కూడా సెలవులు రావడంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో నల్లగొండ బస్టాండ్ కిటకిటలాడుతున్నది. పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబాలు, ఉద్యోగస్తులు సొంతూరికి పయనమవుతున్నారు. శనివారం నల్లగొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ నెలకొంది. ఆర్టీసీ అధికారులు రెగ్యులర్ సర్వీసులతో పాటు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. అయ